# రాని దీపావళి

ఈసారి దీపావళికి జగన్నాథం గుంటూరుకు వెళ్ళడట. పెళ్ళయ్యాక ఇది తొలిదీపావళే- అయినప్పటికీ ఈ కర్నూలులోనే ఏ.బి.సీ. కేంప్‌ల నుండి చిన్న బజారుదాక తిరుగుతూ ఇక్కడే వుంటాడట జగన్నాథం.

మరి అక్కడ గుంటూరులో పుట్టింట- ఆ పిల్ల, అదే-జగన్నాథాన్ని అర్నెల్ల కింద తన జీవిత నాథుడిగ స్వీకరించిన పార్వతి అనబడే పంతొమ్మిదేళ్ళ పిల్ల, కాకర పువ్వొత్తులా వెలిగే కళ్ళుగల పిల్ల, వెన్నముద్దలాంటి హృదయంగల పిల్ల, రంగు రంగుల మతాబాల కలలుకంటున్న పిల్ల-తన దీపావళి కలలన్నీ, తడిసిన టపాకాయల్లా తుస్సుమనగా, మిగిలిన బూడిద ఎదనంతా అలముకోగా అలమటిస్తుంది.

ఎందుకయ్యా, ఈ జగన్నాథం - అనబడే శానిటరీ ఇన్స్‌పెక్టరు దీపావళికి మామగారింటికి వెళ్ళడూ?

అంటే, శానిటరీ ఇన్స్‌పెక్టర్ దొరవారికి దీపావళికి స్కూటర్ కావాలట. వాళ్ళాఫీసులో లక్ష్మీపతికి వాడి మామగారు నిరుడు దీపావళికి కొనిపెట్టారే అల్లాటి స్కూటర్ - సజావుగానయితే నాలుగువేలూ, చీకటి బజారులో నయితే మరికొంచెం ఎక్కువా పలుకుతుందే - అల్లాటి స్కూటర్ కావాలట జగన్నాథానికి.

వందా ఎనభై 'బేసిక్కు'తో రిటైరయిన పార్వతి నాన్న, తన ప్రావిడెంట్ ఫండ్ వగైరా బాపతు అయిదువేలల్లోనూ నాల్గింటిని వెచ్చించి పార్వతిని జగన్నాథం ఇంటిదానిగా చేసిన పార్వతి నాన్న - అలనాడు హరిశ్చంద్రుడిలా తన్నుతాను అమ్మేసుకున్నా పుట్టించలేడు నాలుగు వేలు!

ఆ విషయం పార్వతికి తెలుసు.

ఆవిషయం తెలుసుకో నిష్టంలేదు జగన్నాథానికి.

ఆమెకో, జగన్నాథం కావాలి.

అతనితో నవ్వి, ఎగిరి, పాడి, గెంతి - అలసిపోగల దీపావళి కావాలి.

అతొలి దీపావళి తాము బతికినన్నాళ్ళు తమ జీవితాల చీకటిని పారద్రోలే దీపావళిగా కావాలి.

ఆ ఒక్క దీపావళి తమ ఇద్దరి ఈ ఒక జన్మకు వెయ్యి దీపావళులై వెలగాలి.

అట్లాంటి జగన్నాధుడి దీపావళి కావాలి పార్వతికి. మరి జగన్నాధానికో?

స్కూటర్ కావాలి. ఆ తర్వాతే పార్వతి కావాలి.

ఇంకా అటుపిమ్మట దీపావళికూడా వస్తే వద్దనడు జగన్నాధం!

అందుకనే "జగన్నాధం ఉత్తి వెధవ, మూర్ఖుడు...అంధుడు" అన్నాడు ముకుందం.

* * *

ఆరేళ్ళ కింద--

ముకుందం సుజాతకన్న ముందుగా ఆమె పొడుగాటి జడను చూశాడు.

ఈజడ ఇంత అందంగా వుందేమి చెప్మా అనుకున్నాడు. ఒకనాడు కెమిస్ట్రీ క్లాసులో ఆ సాయంకాలమే అతనికి సమాధానం లభించింది.

అది ఎట్లన్నన్?

కాలేజిని ఒక గంటముందరగా విడిచి, మూడున్నరకే ఇల్లుచేరిన ముకుందం హడావిడిగా సైకిలు దిగి, ఈలవేసుకుంటూ ఇంట్లోకి వెళ్ళపోతూండగా, ఎదురుగా వచ్చింది సుజాత.

పొరబాటున పక్కవాటాలోకి వచ్చేశానేమో ననుకుని, వెనకడుగు వేయబోయిన ముకుందాన్ని చూసి ఫక్కున నవ్వింది సుజాత.

ఆమె నవ్వును చూసి కోపంవచ్చినా, ఆ నవ్వులోని అందంచూసి కోపం విషయం మరిచిపోయాడు ముకుందం. ఆలోగా ఆ అమ్మాయి అతినేర్పుగా అతడికి పక్కగా గోడవారగా నడిచి బయటకు పరుగెత్తుకు వెళ్ళిపోయింది.

అలా బయటికి వెళ్ళిపోయి, పక్క పక్కనేవున్న ఆ రెండువాటాలకు ముందున్న ఉమ్మడి వరండాలో నిల్చుని ఈకింది సందేశాన్ని ప్రసారం చేసింది.

"మీ అమ్మా, మీ ఒదినా కలిసి బజారుకు వెళ్ళారు. వంటింట్లో ఫ్లాస్కులో కాఫీవుంది. తాగమన్నారు."

"ఎవరిని?" అన్నాడు ముకుందం. కర్తా, పాడూలేని పైరెండో వాక్యనిర్మాణం పట్ల విసుక్కుంటూ.

అందుకు ఆ అమ్మాయి సమాధానం చెప్పవచ్చునా? ఉహు, అట్లాటిదేమీ చెయ్యలేదు. పై పెచ్చు అదేదో రత్నాలూ, ముత్యాలూ అంటారే వాటన్నిటినీ రాసులు రాసులుగా ఒలకపోస్తున్నట్లు నవ్విపారేసింది.

ఔరా! ఔరా!! ఔరారా!!! ఇంతందమైన పిల్ల, ఇంచక్కా నవ్వేపిల్ల గనకనే-ఆ జడ అంతందంగా పొడుగ్గా, నయాగరా జలపాతంలా వుందిస్మీ-అని భాష్యం చెప్పకుంటూ కాఫీని సేవించసాగాడు ముకుందం.

కాఫీముగిశాక, "ముందు వెనకల" అంటూ ఏదో త్యాగరాజకృతి కాబోలు ఎత్తుకొని

ఆ రెండు పదాల కవతల ఏముందో తెలియక, తచ్చాడి, "ననసా" అని ముగించిన ముకుందానికి మళ్లీ రత్నాలు రాసులు పోస్తున్న శబ్దం వినిపించింది.

ఆమరురోజునుండే ముకుందం చాల పెద్దమనిషయిపొయ్యాడు. కాలేజీలో విమలకు (ఆమె అడిగినా, అడగకపోయినా) ప్రాక్టికల్ నోట్‌బుక్కు అరువు ఇస్తూ వచ్చిన అలవాటు నుండి తప్పుకున్నాడు. ఆంజనేయుని గుడిముందు కూచునే గళ్లరవిక తొడిగే గడుసుపిల్ల దగ్గర పూవులు కొనడం మానివేసి, తనభక్తి ప్రపత్తులను చెన్నకేశవస్వామి ఆలయంవైపు నడిపించాడు. వీధుల్లో వెళ్తూ వెళ్తూ, కళ్ళు వీపు వైపుకుకూడా వచ్చేటట్లుగా రవికల వంపులు చీరెల సొంపులు చూడడం మానివేశాడు. అడ్డమైన ఆడవారిటీ వయసులు గుణించడం బొత్తిగా మరిచిపోయాడు.

ఇంతోటి విప్లవకరమైన మార్పులన్నీ అతగాడిలో చకచకా వచ్చేయడానికి కారణం -- ఆ రతనాలనవ్వే- ఆ పొడుగాటిజడే- - - అలా అలా తిరిగే ఆ పెద్ద కళ్ళే.... ఇన్ని మాటలేల ఆ సుజాత అనబడే పిల్లే!

ఆ అమ్మాయిని తనదానిగా భావించుకో నారంభించిన ముకుందంలో ఏకపత్నీ వ్రతుడైన ఆ శ్రీరామచంద్రుడు పీఠం వేసుక్కూచున్నాడు.

మరి ఈవిషయం 'సీత'కు తెలుసునా?

"ఊఁ - తెలుసు" అన్నట్లుగా సుజాత అనబడే సీత తలవూచింది - మళ్ళీ ఆర్నెల్ల తర్వాత ఒకనాడు ఏకాంతంలో ముకుందం ఆమెను నిలవేసినప్పుడు

అలా నిలవేసిన ముకుందం - "సుజాతా!.... మరి.....మరి......నేను.....నిన్ను...." అని తడబడి ముడివడి చివరకు "నా మనస్సు నిండా నువ్వే వున్నావు తెలుసా?" అన్నాడు.

"ఊఁ-తెలుసు" అన్నట్లుగా తల ఊచిందా బొమ్మ-

ఆ ఊపులో ఆ జడ భుజంమీదుగా వచ్చి ముందుకుపడింది. ఆ ఆర్నెల్ల కాలంలోనూ ఏ మూడువందల అరవైసార్లో కలలో కనపడుతూ వచ్చిన ఆ జడను ఒక్కసారి స్పృశించి తరించి పోదామని చాలభక్తితో చేయిజాచాడు ముకుందం.

"ఊఁ! తప్పు!" అన్నట్లుగా ఆ అమ్మాయి వెనక్కడుగువేసింది. ఎండచేత్తోతీసి ఆ జడను వీపువెనక దాచుకుంది.

ఔరా! ఏమిచేతులివి..... సాక్షాత్తు దేవలోకపు కన్యలకుండవలసిన చేతులివి!

ఆచేతులనుంచి ఆ మట్టిగాజుల్ని తీసేసి ఒక్కజత బంగారుగాజులను తొడిగితే ఆ చేతులను నెత్తిమీద వుంచుకోవచ్చునే...వాటినట్లా నెత్తిమీద వుంచుకోవడాని కోసం వెయ్యిన్నొక్క జన్మల తపఃఫలాన్ని ధారపోయవచ్చునే....

-వగైరా ఆలోచనలలో పడిన ముకుందం "జరగండి - నే వెళ్ళాలి" అన్నమాటలు వినిపించాయి.

"మరి నా ప్రశ్నకు సమాధానం?" అన్నాడు ముకుందం.

"మీరేం ప్రశ్న వేయలేదు."

"అదే నువ్వు....నన్ను...నువ్వేమో...నాకు...నేనంటే...మనిద్దరమూ"

"మా అన్నయ్య ఒదినల నడగండి--" అని తుర్రుమంది సుజాత.

తండ్రిలేని ముకుందం తనతల్లితో ఈ విషయం చెప్పగా "టట్! వాళ్ళ శాఖ ఏమిటి? మన శాఖ ఏమిటి?" అని కోప్పడిందావిడ....ఆ తర్వాత వారం రోజులలో అబ్బాయి సరిగా తిండి తినక, నిద్ర సరిగాపోలేక చిక్కిపోవడం చూసిన తల్లి హృదయం తట్టుకోలేకపోయింది. "సరే, నీకంతగా మనసుంటే చేసుకోరా.... పిల్లకేం కాస్త రంగు తక్కువయినా ముక్కూ కన్నూ బావుంది. ఏదో మెట్రిక్ దాక చదివిందికూడా..." అందావిడ.

ఏమిటి ఈవిడ - సుజాతలాటి దేవలోకపు పిల్లవిషయంలో వెధవ మెట్రిక్ ఎవరికికావాలి.... రంగు తక్కువట.... ఈ అమ్మకేం తెలుసు.... వయసు ఎక్కువయిందేమో దృష్టికాస్త మందగించినట్లుంది..."ఆ కళ్ళు అజడ.... ఆనవ్వు....అన్నిటికన్నామించి....ఆ చేతులు...చూశావ్వా" అని సకారణంగా వాదిద్దామనుకున్న ముకుందం కొడుకు తనతల్లితో ఇట్లాంటి విషయం మీద మాట్లాడ్డం మహాచెడ్డకష్టం అని తెలుసుకుని వ్వూర్కుండిపోయాడు.

ముకుందం అమ్మ సుజాత వాళ్ళన్నయ్య నడిగితే "మా పెద్ద చెల్లెలు మద్రాసులో హాస్టల్లో వుండి చదువుతూంది. దానికి పెళ్ళయ్యేదాక సుజాతకు చెయ్యలేమండి--" అన్నాడు.

ముకుందానికి కోపంవచ్చింది....

అమర్నాడెప్పుడో బావిదగ్గర తటస్థపడితే "నేనిన్ను పెళ్ళిచేసుకోను ఫో" అన్నాడు సుజాతతో. ఆ అమ్మాయి ఇటూ అటూచూసి జడతో నెమ్మదిగా అతడి చేతిమీద ఒకదెబ్బ లాటిదివేసి బిందె చంకను పెట్టుకుని వయ్యారంగా నడిచివెళ్ళింది.... "ఔరా ఈ బిందె అనబడు జడ పదార్థంబు ఎంత అదృష్టంబు చేసియున్నది-" అని అసూయపడిపోతూ నిల్చుండిన ముకుందం ఒంటిమీద - సినీమాతారలు వాడని సబ్బుతాలూకు నురగ ఎండిపోయి పొడిపొడిగా రాలిపో నారంభించింది!

ఆసారి దీపావళిరోజు సాయంకాలం మహా వీరుడిలా విజృంభించి టపాకాయలేమిటి, ఆటంబాంబులేమిటి చులాగ్గా ఎడంచేత్తో అంటించి పారవేస్తున్న ముకుందానికి, పక్కవాటాముందు ప్రమిదల మధ్య లక్ష్మీదేవి అవతరించడం కనబడింది. ఆ అమ్మాయి వాళ్ళన్నయ్య పాపాయిచేత కాకర పువ్వొత్తులు కాల్పిస్తూంది. ఆమెకండ్ల వెలుగు పదికోట్ల ప్రమిదల పెట్టు అనుకున్న ముకుందం ఒక్కరికి మాత్రమే వినబడేటట్లుగా "ఇట్లా విడివిడిగా రెండు దీపావళులు గాక ఒక్క దీపావళే చేసుకోవాలి" అన్న కోరిక ప్రకటించాడు. "ష్!" అంది సుజాత పెదాలమీద వేలుంచి. కనుబొమలు నెగరవేస్తూ. ఆ రాబోయే వారిద్దరి దీపావళినాడు ఏమిటేమిటి చెయ్యాలో సవివరంగా చెప్పింది ముకుందం మనస్సారాత్రి.

కాలేజి ముగించి, బి.ఎస్.సి. పాసయి హైదరాబాద్‌లో ఓ కంపెనీవారు ఇంటర్‌వ్యూకు పిలవగా విజయం సాధించుక వచ్చాడు ముకుందం. అతడు విజయవాడ విడిచి వెళ్ళే ముందురోజుదయం--

ముకుందం వాళ్ళమ్మ ఎదురింట్లో ఏదో ఇచ్చిరావడానికి వెళ్ళినప్పుడు- వదినను పుట్టింటికి పంపించిన అన్నయ్య స్నానం చేస్తుండగా ఆమె అతడికి కనబడింది.

"వెళ్ళిపోతున్నారు కదూ--" అంది గుడ్ల నీరు కుక్కుంటూ.

అతడు తుడవబోతే దూరంగా జరిగి, ఇది....మీకోసం..... అని అతడి చేతికో తెల్లటి, తన హృదయంలాటి రుమాలు నిచ్చింది. ఆ రుమాలు మీద, ఆమె హృదయంమీద అతడి మూర్తివలె. "ము" అని ఎంబ్రాయిడరీ చేసి వుంది.

"నేనెక్కడికి వెళ్ళినా నీదగ్గరికే వస్తా సుజాతా! అది ఈనాడే కాదు, జీవితాంతమూ అంతే" అన్నాడు ముకుందం.

"మరిచిపోతారా---"

"నన్నంత ధూర్తుడిగా, కృతఘ్నుడిగా" అని కోపంతో ఏదేదో అనబోయిన అతడి నోటిమీద ఆమెకుడిచేతి వేళ్ళు నిలిచాయి. ఆశ్చర్యంతో ఆ చేతిని పట్టుకుని పెదవుల కానించుకున్నాడు ముకుందం.

ఆమె చేతిని లాక్కుంది.

"మీ అక్కయ్యకు ఏదయిన సంబంధం వెతుకుతాను..."

"నాకు తెలుసు"

-- అని ముకుందం అన్న ఏడాది తర్వాత సుజాత అక్కయ సుశీలకూ, భారత రైల్వేశాఖ వారి విధేయులయిన గుమాస్తాలలో ఒకడయిన చినవెంకట సుబ్బారావుతో వివాహం జరిగింది. ఆ మరురోజు ఇంకో సుముహూర్తాన సుజాత శ్రీమతి ముకుందం అయింది.

పెళ్ళయిన నెలరోజుల తర్వాత ముకుందం తల్లి కాశీ యాత్ర బయలుదేరి వెళ్ళింది. ముకుందానికి చిన్న ప్రమోషన్ మీద మహబూబ్‌నగర్‌కు బదిలీ అయింది.

ఆ మిట్టపల్లాల మహబూబ్‌నగర్‌లో ఆ అమ్మాయి అబ్బాయిల దాంపత్యం మొదలయింది.

"వెధవ ఆఫీసు....వెధవ ఉద్యోగము....రోజూ ఎవడు వెళ్తాడు...నేను నీ ఎదుట కూచుంటా..."నని రోజూ విసుక్కునేవాడు ముకుందం భోజనం ముగించి, బట్టలు వేసుకుంటూ

"నా బాబుకదూ....ఆఫీసెంత నాలుగున్నర కల్లా అయిపోతుంది...మధ్యాహ్నం రెండింటికి టిఫిన్‌కు ఇంటికి వస్తారా....ఇవాళ మీకేమో మధ్యాహ్నానికి రవ్వలడ్డూ జంతికలూ చేసి పెడతా. జంతికల్లో నువ్వులువేసి మరీచేసి పెడతా...ఏం మంచి అబ్బాయిగారు కదూ...వెళ్ళిరండి.....పదయిపోతూంది...మరీ ఆలస్యం అయితే బాగుం టుందా చెప్పండి....ఇక్కడ ఆఫీసులో అందరికన్న పైవారు మీరేనయ్యె.....మీరే సరిగ్గా వెళ్ళకపోతే బాగుంటుందా--" అని గారాబుచేసి, లాలించి, బతిమాలి, నచ్చజెప్పి అతడి చేతికి బ్రీఫ్‌కేస్ నిచ్చి పంపేది సుజాత.

ఒక్కోరోజయితే -- "నాకేమో పెద్దపంక్చుయాలిటీ బోధిస్తావు నువ్వు....ఆ వెధవాఫీసుకు పదింటికల్లా అఘోరించేది నేనొక్కడినే తెలుసా? మిగతావాళ్ళంతా

హాయిగా పదిన్నరనుండి రావడం మొదలెడతారు. మరినేమాత్రం...." అంటూ ఎదురుతిరేగేవాడు ముకుందం.

"వాళ్ళని హెచ్చరించండీ...అది మీ ధర్మం....."

"అబ్బ....ధర్మాలు చెప్పడానికి ఈభూమ్మీద నువ్వొక్కర్తెవు చాలు....ఏవిటి హెచ్చరించడం"

"నామొహం....ఇద్దరేమో బ్రహ్మచారి ముండాకొడుకులూ...చేతులు కాల్చుకుని మరీ రావాలి....మరి ఆ యాభై ఏళ్ళ మామ్మగారికేమో నెలలు నిండుతున్నాయీ.....

"ష్...ఏవిటా బండతనం...." అని అతడి నోటిని మూయబోయిన సుజాత చేయి అతడి చొక్కా బొత్తాలమీద ఆడుకునేది.

"మరి..ఇక మిగిలిందెవరూ...ఆ జఫారా? కుర్రవెధవ....పెళ్ళయి నెల కాలేదుగా! ఆఫీసుకు సరిగా పదికి ఎలా రాగలడు చెప్పు...." అని అల్లరిగా ముకుందం చూసేసరికి ఆమె మొహం సిగ్గులహారి విల్లువెనక దాగుకునేది.

"అంతా అబద్ధం...."

"పచ్చి నిజం సుజాతా! ఇదిగో నీచేతిమీద నేను...."

"ష్"

క్షణమొక కలగా, మాటలే సంగీతంగా, ఆ రెండుగదుల పెంకుటిల్లే స్వర్గధామంగా ఎగిరి పోసాగాయి రోజులు.

ఉగాది రోజుదయం అతడి పాదాలకు నలుగు పెట్టి తలంటిపోసింది సుజాత. కొత్త ధోవతి, లాల్చీ ధరించాక ఉగాది పచ్చడినతడికిచ్చి... "దీని అర్థం ఏమిటో తెలుసా?" అని, జీవితం కూడా ఈ పచ్చడిలాగే తియ్యగా, చేదుగా వుంటుందని, అదని, ఇదని వివరించ సాగింది.

తడి ఆరని ఆజుత్తు, కళ్ళల్లోని ఆతేజం నిజంలా వెలిగే ఆ కుంకుమబొట్టు, న్యాయంవలె నిలిచిన ఆమెడ– ఈదేవత నాదా, నాదేనా? అన్న ఆశ్చర్యంతో చూస్తున్న ముకుందాన్ని అడిగింది సుజాత–– "ఏమండోయ్ విన్నారా నేను చెప్పిందంతా?"

"ఆ!"

"ఏమిటి?"

"నీ చేతులిట్లానే!"

ఆమె చేతులను శిల్పిలా పరీక్షించి చివరకు సీరియస్‌గా అన్నాడు ముకుందం... "నవరత్నాలు పొదిగిన అపరంజి గాజులు వందా ఎనిమిది తెచ్చి ఈ చేతులకు పూజ చేయాలి తెలుసా? "

"చాలా?" అంది సుజాత.

వారిద్దరి నవ్వుకు దేవతలే అసూయపడి వుండాలి.

ఆ అక్టోబరులో దీపావళికో ఇరవై రోజుల ముందుగా హెడ్డాఫీసువారు పిలవగా హైదరాబాద్ వెళ్ళాడు ముకుందం. రెండురోజులలో ఆఫీసు పని ముగిసింది. ఎదురు చూడకుండా బోనసుడబ్బు ఆరువందల చిల్లర చేతికి వచ్చాయి. ఆ డబ్బుపట్టుకుని

హజారీమల్ మార్వాడీ దుకాణానికి వెళ్ళి ఉదయభానుడి కిరణాలవంటి బంగారు గాజులు రెండు జతలు కొన్నాడు.

వీటిని దాచిపెట్టి, రెండున్నర సంవత్సరాలనుండి ఎదురు చూస్తున్న తమ దీపావళి రోజుదయం ఆ దేవత చేతులికవి తొడిగి, ఆ గాజుల అందం ఆ చేతులవలన ఎంతగా ఇనుమడిస్తుందో, ఆమె కళ్ళు ఎంతలా మెరుస్తాయో చూడాలి. మళ్ళీమళ్ళీ చూడాలి-- అన్న పరవళ్ళుతొక్కే కోరికలను తొక్కి పెట్టి హైదరాబాదును వదలి రైలెక్కి మహబూబ్ నగర్ చేరాడు ముకుందు.

అతడు రైలు దిగేసరికి చేతివాచి ఒకటిన్నర చూపించింది.

అంత గాఢాంధకారంలోనూ-అతనిని గుర్తుపట్టి, జఫార్ అతడి దగ్గరకు వచ్చాడు.

"సార్, సార్!"

"ఏమిటయ్యా! అర్ధరాత్రివేళ నువ్వు చచ్చి చెడి స్టేషనుకు రావడం ఎందుకూ?" అన్నాడు ముకుందు.

"అదికాదు సార్! అమ్మగారికి నిన్న సాయంకాల కడుపులో పోటు వచ్చిందండీ.... మరి మీకు వెంటనే టెలిగ్రాం ఇప్పించాము...అందిందా సార్...."

"సుజాత! ఎక్కడ? ఇపుడెక్కడ వుంది-- ఎట్లావుంది."

"ఆస్పత్రిలో వున్నారు సార్...."

ఆ అస్పత్రిలో--

ఆపరేషను ముగిసిన గంటన్నర తర్వాత, రాత్రి ముగిసి వెలుగు వచ్చేవేళ - ముకుందం జీవితంలో వెలుగు ఆరిపోయింది.

-- పదిహేడు రోజుల తర్వాత దీపావళినాడు మహాబలిపురంలో సముద్రపుఒడ్డు ఆలయం మెట్టుమీద కూచొని వున్నాడు ముకుందం.

"నెనెక్కడికి వెళ్ళినా నీ దగ్గరికే వస్తా అన్నాడు తను ఒకరోజున. తను వచ్చాడు. కాని ఆమెలేదు. ఆమె వెళ్ళినపుడు వెళ్ళలేని మానవుడు తను. తన మాట అబద్దం. బతుకే ఒక పెద్ద అబద్దం. వెలుగు వెలుగు అని ఎదురుచూసినది ఆరని మంటగా మిగిలింది.

తెల్లగా నవ్వుతూ, కేరింతలు కొడుతూ వచ్చి ఆ ఇసుక దేవుడికి తలలువంచి దండాలు పెట్టి, అడ్డంగావున్న ఆ గోడమీదపడి మడిసి పోతున్నాయి అలలు. అలపోయి అలవస్తూంది. ఆ కొన్ని క్షణాలలో ఆ అలకు ఎన్ని నవ్వులు ఎన్ని సంతోషాలు!

పొడుగాటి ముక్కున్న పక్షి ఒక్కటి బాణంలా దూసుకువచ్చి గబుక్కున నీటిలోకి మునిగి మరుక్షణం రివ్వున పైకిలేచి వెళ్ళింది. దాని ముక్కు చివర చేప గిలగిలలాడింది.

ఆ దూరంగా వస్తున్న అల ఎంత అందంగా ఎంత గంభీరంగా వుంది.

అచ్చం సుజాత చేతిలావుంది ఆ అలలోని వొంపు!

ముకుందం కుడిచేయి 'జేబులోకి వెళ్ళింది.

ఆ తెల్లటి రుమాలు మధ్య వున్నాయి హజారీ మల్ మార్వాడీ అయిదువందల

అరవై ఎనిమిది రూపాయలు మరియు సేల్స్‌టాక్సు పుచ్చుకుని ముకుందానికి ఇచ్చిన నాలుగు గాజులు:

ఒక్క క్షణం పసుపుగా మెరిశాయి. అవి అలల నురుగు మీద.

మరుక్షణం ఎన్నో అడుగుల లోతులో ఏవో చేపలు.... "ఇదేం రకపు--ఆహారం చెప్మా--అనుకుని ఆ గాజులచుట్టూ గుమికూడాయి.

అందుకనే ముకుందం - అన్నాడు "జగన్నాధం ఉత్తి వెధవ, మూర్ఖుడు, అంధుడూ! వాడు మనిషిగా జన్మించతగడు" అని.

ముకుందానికి దీపావళి రాదు.

జగన్నాధాలకు దీపావళి రాకూడదు.

('ఆంధ్రవాణి' '68)